

# విరామం

## – అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుం యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

*(గత సంచిక తరువాయి)*

## 21

యుద్ధం ముగిసింది. కాని యింకా యుద్ధ వాతావరణం వుంది. సైన్యాల విడుదల కార్యక్రమం ఆరంభమైంది.

సుభాస్ చంద్రబోసు తయారు చేసిన "ఆజాద్ హింద్ ఫౌజు" వీరులు యుద్ధఖైదీలుగా జట్లు జట్లుగా స్వదేశం వస్తున్నారు.

దేశం నూతన రాజకీయ వాతావరణంతో తుక తుక లాడుతోంది. దేశం దాస్యవిముక్తి పొందే శుభసూచన లగుపిస్తున్నాయి.

కలకత్తానించి బ్రిగేడియర్ బయిూయెమ్ యీ తనిఖీ పర్యటన చేస్తూ చిట్టగాంగు వచ్చేడు. అక్కడ 404 లైన్ ఆఫ్ కమ్యూనికేషన్ ఏరియా హెడ్ క్వార్టర్సుంది. ఏరియా కమాండర్ కల్నలు జేమ్సు. చండశాసనుడు. అతని పేరు వింటే పిట్టలు నీళ్ళు తాగవు. ఆఫీసర్లు గడగళ్ళాడ్తారు.

బ్రిగేడియర్‌తో కల్నలు కూడా తిరుగుతున్నాడు. వాళ్ళిద్దరూ మా యూనిటు తనిఖీ చెయ్యడానికొచ్చారు. యూనిటంతా చూసి, ఆఫీసులో నాతో కూడా కాస్సేపు మాట్టాడేరు "అయితే నీకు యూనిటు ఆరంభదశ నించీ ఆఫీసు వ్యవహారాల్లో అనుభవముందన్నమాట..."

"ఔను సర్"

బ్రిగేడియర్, కల్నలు ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు. "నువ్వు పదిమందిచేత పని చేయించి ఆఫీసు నడపగలవన్నమాట..."

"అలాగే భావిస్తున్నా సర్..."

వాళ్ళిద్దరూ తిరిగి మొహాలు చూచుకొన్నారు. కల్నలు నా వివరాలన్నీ చిన్న నోటు పుస్తకంలో రాసుకొన్నాడు.

నాలుగు రోజులు తరవాత నాకు ఏరియా ఆఫీసుకి బదిలీ అయింది.

ఇది నాకు మంచిదే కాని మనసు చివుక్కుమంది, ఈ యూనిటు పుట్టకముందొచ్చా. నేనూ, ఓ.సీ. మొదట ఈ అడివిలో వెదుళ్ళు విరిచి పని ఆరంభించేం. ఇక్కడ పిన్ను దగ్గర్నించి ఏనుగులంతేసి యంత్రాలు, లారీలు అన్నిటికి నేనే ఇండెట్లు తయారుచేశా. ఈ యూనిటు సిబ్బందిలో నాలుగేళ్ళు గడిపా. అందరి గౌరవం అభిమానం పొందా, వాళ్ళందర్ని విడిచి పెట్టడం కష్టంగా వుంది. కాని తప్పదు.

ఈ బదలాయింపులో నా హోదా పెరిగింది. నాకు వైస్రాయి కమిషనొచ్చింది. ఓ.సీ. వాళ్ళ మెస్సులో నాకు వీడ్కోలు విందుచేసేడు.

ఏరియా ఆఫీసులు యెత్తైన కొండమీదున్నాయి, అక్కడికి వెళ్ళడానికి సుమారు మూడు వందల మెట్లుంటాయి. కార్లు, లారీలు వెళ్ళడానికి విశాలమైన తిరుగుడు మార్గం ఉంది.

మా ఆఫీసు చాలా పెద్దది. అంతా ఆఫీసర్లే. నా విభాగానికి నేనే పెద్ద. నా దగ్గర యిద్దరు సివిలియను టైపిస్టులున్నారు. ఒక స్త్రీ, ఒక పురుషుడు. ఒక సార్జంటు కూడా వున్నాడు. అతని పేరు స్టటన్. అతను “ఛీఫ్ క్లర్కు"ట. నేను వెళ్ళగానే అతనికా హోదా పోయింది. అతనికి పనిరాదు. ఫైళ్ళు మొయ్యడమే తెలుసు.

స్టటన్ టైపిస్టుల మీద అధికారం చలాయించే వాడు. వాళ్ళని తిట్టేవాడట. ఆ సాయంత్రం మగ టైపిస్టు భట్టాచార్జీ అన్నాడు. “జమేదార్ సాబ్! వీడింతవరకూ ఛీఫ్ క్లర్కుగా చలామణీ అవుతున్నాడు. ఇప్పుడు నువ్వొచ్చాకా సి.సి. అంటే చీఫ్ కూలీ. ఫైళ్ళు బాగా మోస్తాడు.”

నేను పనిలో ప్రవేశించడానికి వెళ్ళినపుడు, మొదట నాకిదివరకు పరిచయం వున్న “రిఫ్రిజేషన్ ఆఫీసర్” కెప్టెన్ న్యూసమ్ దగ్గిరకెళ్ళా. అతను నన్ను మొదట కల్నలు దగ్గరికి తీసుకెళ్ళి తరవాత మిగిలిన ఆఫీసర్లందరితో పరిచయం చేసేడు. అప్పుడు మాతో కల్నలు కూడా వున్నాడు.

“ఇతను మిస్టర్ భట్టాచార్జీ, టైపిస్టు...” కెప్టెన్ న్యూసమ్ చెప్పేడు.

“తప్పులు కొట్టడంలో ప్రసిద్ధుడు..." కల్నల్ అన్నాడు.

నేను నవ్వేను.

"మిస్ ఉమ, టైపిస్టు, తప్పులు కొట్టదు కాని, ఎప్పుడూ పరాకే. నువ్వావిణ్ణి మేల్కొలపాలి.'’

నేను నవ్వలేదు. ఉమ వేపు తదేకంగా చూశా. గుండె కొట్టుకొంటూంది. కల్నల్, కెప్టెన్ వెళ్ళిపోయేరు. నేను ఉమ దగ్గిరకెళ్ళా.

“నీ పేరు... ఉమ?"

“ఔను సర్...” భయంగా అంది.

“నాకు నమ్మకం లేదు....”

“ఏం సర్...? నిజంగా నా పేరు ఉమ..."

నా చుట్టూ స్టటన్ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు

“జమేదార్ సాబ్! అన్ని అర్జంటు కాయితాలున్నాయి...” అన్నాడు స్టటన్.

“పరవాలేదు... ఇప్పుడే వస్తున్నా... మిస్ ఉమా! మీ దేవూరు?”

“ప్రస్తుతం ఈ వూరే...”

“జమేదార్ సాబ్! పదిన్నరైంది. మరో పావుగంటకి కల్నల్ సాబ్ నిన్ను పిలుస్తాడు. ఇవాళ బుధవారం. ఏరియా ఆర్డర్లు తయారుకావాలి..." స్టటన్ నన్ను హెచ్చరించినట్లు అన్నాడు.

“తొందరపడకు. ఆయన పిల్చినప్పుడు వెళ్తా. అన్నట్టు సార్జంటు స్టటన్! నీ సీటెక్కడ?...

“ఆ గదిలో ఆఫీసర్ల గదిలో..."

“అక్కడెందుకూ? నీ సీటిక్కడికి మార్పించేస్తా. ఇవాళ నించీ యిక్కడే పనిచెయ్యి...”

స్టటన్ గునుస్తూ వెళ్ళిపోయేడు.

“మిస్ ఉమా! చిట్టగాంగు మీ స్వగ్రామమా?”

"కాదు మాది కొమిల్లా...”

“నిన్నెక్కడో చూసినట్టుంది. బాగా తెలిసినట్టుంది. కాని...”

"అసంభవం. నేను మిమ్మల్నిదివరకెన్నడూ చూళ్ళేదు."

“అసంభవం! ఔను అచ్చంగా అలాగే అంటుంది పద్మ.”

"పద్మ! ఓహో! మా పద్మ మీకు తెలుసా?"

“ఏ పద్మ?” అమాయకంగా ప్రశ్నించా.

“మా అక్క. నాలాగే వుంటుంది. నాకంటె మూడేళ్లు పెద్ద”

“ఆమె ఉద్యోగం చేసేదా?"

“ఔను, కలకత్తాలో. చాలాకాలమైంది వుద్యోగం మాని...”

“మీది కొమిల్లా...”

"ఔను. మా నాన్నగారు పోయేరు. బెంగతో పోయేరు....”

“ఓహో! అయితే రంగూన్ ట్రేడింగ్ కో వాళ్ళు నీకేమైనా అవుతారా?"

“ఆ కంపెనీ యజమాని మా పెద్దతండ్రి గారే...”

“నిజం ?"

“నిజం ...”

“నీలాగే... నీలాగే వుంటాడు. అషూ.."

“అషూ... నా తమ్ముడు. ఇక్కడే ఒక మిలిట్రీ యూనిట్లో “బాయ్”గా పనిచేస్తున్నాడు”

“భగవాన్!... నీకు లహరీ తెలుసా?”

ఆమె గాభరాపడి, దిక్కులు చూసి తల దించుకుంది. స్టటన్ గబ గబ వచ్చేడు.

"జమేదార్ సాబ్! నువ్వు కాఫీ తాగుతావా. టీనా?"

"ఏదైనా సరే..."

"నో నో... ఏదో ఓటి చెప్పాలి...."

"టీ ప్లీజ్!"

వెళ్ళిపోయేడు.

"అయితే నువ్వు మిస్ ఉమవి. పద్మ చెల్లివి..."

"మీకు పద్మని తెలుసా?"

"ఒకసారి నేను, ఆమె కలసి లాంచిలో పద్మానది మీద ప్రయాణం చేశాం. చాలాకాలం కిందట. అంతే పరిచయం. పద్మ యెక్కడుంది?"

ఆమె జవాబు చెప్పలేదు. నాకు కల్నల్ దగ్గర్నించి పిలుపొచ్చింది.

ఒంటిగంటైంది. లంచ్ వేళ. భట్టాచార్జీ గబగబ మెట్లవేపు వెళ్ళిపోతున్నాడు.

నేను ఏరియా ఆఫీసుకి బదిలీ అయిపోయినా, సిక్స్తిండియన్ క్యాంపులోనే వుంటున్నా. అందుకు యెవ్వరూ అభ్యంతరం చెప్పలేదు.

"మిస్ ఉమా! నాతో మా యూనిటుకి రాకూడదూ? కలిసి భోంచేద్దాం..." అడిగాను.

"ఎందుకండి. నేను టిఫిను తెచ్చుకున్నా..."

"అయితేనేం. మెట్లకింద జీపువుంది...."

"""క్షమించండి. ఇవాళ కాదు..."

"నీతో మాట్లాడాలి. ముఖ్యమైన విషయం. మా యూనిటుకి రేపు సాయంత్రం రా..."

"మీ యూనిటుకా..." జంకుగా అంది.

"ఔను. అంటే సిక్స్తిండియన్. ఇప్పటికీ అదే నా యూనిటని భావిస్తా.

"ఒద్దండి. మరెక్కడైనా..."

"అలా అనకు, నువ్వక్కడికే రావాలి. లహరీ వున్నాడుగా. నాకు అతన్ని ఆశ్చర్యంలో ముంచాల్నుంది."

"ఒద్దు సర్..."

'ఏం పరవాలేదు, రేపు సాయంత్రం మీ యింట్లో వంట చెయ్యొద్దు. చెల్లెళ్ళందర్నీ తీసుకురా. అషూ ఎలాగూ అక్కడే వుంటాడు. అతిథిగా నువ్వు నాపక్క కూచుంటే లహరీ చేత నీకు వడ్డింపిస్తా."

"ఒద్దు సర్" అని నవ్వింది. నేనూ నవ్వా.

"ఓకే..." అని నే వెళ్ళిపోయా.

సాయంత్రం ఉమని జీపులో యింటికి దిగబెట్టా.

"స్టటన్ కి చాలా ఈర్ష్యగా వుంది. నేను మీతో అనవసరంగా మాట్లాడకూడదు,"

"ఏమిటి వాడి వుద్దేశం?"

"మంచి వాడు కాదండి..."

మేం మాట్లాడుతూంటే ఉమ చెల్లెలు పధ్నాలుగేళ్ళది టీ తెచ్చింది.

"నీకిదో శ్రమా?"

"శ్రమేముందండీ... గాయత్రీ! జీపు డ్రైవర్ని లోపలికి రమ్మను, అతనిక్కూడా టీ ఇయ్యి..."

ఆరుగంటలవుతుంది. గదిలో నేనూ ఉమే వున్నాం. అప్పుడప్పుడిద్దరం నిశ్శబ్ద మైపోతున్నాం. నా నిశ్శబ్దం వెనక పెద్ద వుబలాటం వుంది. దాన్ని విచ్ఛిన్నం చెయ్యాలి.

"మిస్ ఉమా! నిన్నోసంగతి అడుగుతా, చెప్తావా?"

ఉమ అలాగే అని తలూపింది.

"పద్మకేమైంది? ఎక్కడుంది."

ఉమ బెదిరిన లేడిలా చూసింది.

"కలకత్తాలో యేమైందో నాకు తెలుసు. కమల్ చెప్పేడు...."

"కమల్! ఓహ్ కమల్! ఆయన్ని నేనెప్పుడూ చూళ్ళేదు. మా అక్క పనిచేసే ఆఫీసు యింటి యజమాని..."

"అతనే. అతను మీ అక్కని చాలా ప్రేమిస్తున్నాడు."

"మా అక్క శలవల్లో వున్నప్పుడు వుత్తరాలు రాసేవాడు. ఇప్పుడతనెక్కడున్నాడో తెలీదు..."

"అదంతా ఒక గాథ, అది చెప్తే నీ మనసు బాధపడుతుంది. ఐనా చెప్తా, మరొకప్పుడు. ముందు పద్మ సంగతి చెప్పు. నాకు చాలా ఆత్రుతగా వుంది."

"ఉద్యోగం విడిచి అక్క వచ్చినప్పటికి మా నాన్నగారికి బ్లడ్ ప్రషరొచ్చింది. అతి మూత్రం కూడా వచ్చింది. అక్క వచ్చిందిగాని ఆమె మనసు దెబ్బతింది. ఉద్యోగం లేదుగదా అన్న బెంగకూడా వుంది. నేనప్పటికింకా చదూతున్నా. నాన్నగారి జీతం చాలదు. ఇల్లు చాలాభాగం కూలిపోయింది..." ,

"మీ పెదనాన్నగారు ధనవంతులు కదా. మీకు సాయం చెయ్యలేదా;"

“అబ్బే, మాకు వాళ్ళకీ అంత రాకపోకల్లేవండీ. మేం బీదవాళ్ళం. బీదవాళ్ళకి బంధువులు సాధారణంగా దూరంగా వుంటారు. అయితే, మా నాన్నగారు పోగానే, మా పెదనాన్నగారే మమ్మల్ని ఆదుకున్నారు. అన్నదమ్ములిద్దర్లో యేం అభిప్రాయ భేదాలుండేవో మాకు తెలీదు. కాని యిప్పుడు వాళ్ళందరికీ మేమంటే అభిమానమే”

“మరి మిమ్మల్ని వేరుంచేరేం?"

"ఇదే మంచిదండీ. కలిసుంటే కలతలొస్తాయి. కొమిల్లాలో యిల్లు అద్దెకిచ్చేం...”

“ఔను నేనాయింటికెళ్ళా...”

“నిజం? ఎలా తెలిసింది? మా యిల్లు బాగుందా? కొబ్బరి చెట్టుందా. పెరట్లో చెట్లు బావున్నాయా?”

ఆమెకి కళ్ళంట నీళ్ళొచ్చేయి. 'ఉన్న వూరు, కన్నతల్లి' అన్నారు.

“మీ యిల్లు చాలా బావుంది. ఉమా! పెరట్లో చెట్లు చూళ్ళేదు. గాని వీధి వెంపు కొబ్బరి చెట్టు నిక్షేపంలా వుంది. పిక్కాడిల్లీ దగ్గిర వీధి వెంపు కొబ్బరి చెట్టున్న యిల్లు మీదే.”

"ఔను! మీకెలా తెలుసు?” ఆమె యేడుస్తూ అన్నది.

“ఏడవకు. పద్మ చెప్పింది. ఉమా! అక్క సంగతి చెప్పవా?”

“అక్క యెప్పుడూ దిగులుగా వుండేది. వీధిలోకెళ్ళేది కాదు. కమల్ దగ్గర్నించి వుత్తరాల్లేవు. అంచేత మరీ బెంగగా వుండేది. దీనికి తోడు తలమీద పిడుగు పడ్డట్టు ఆమె తల్లి కాబోయే సూచనలగుపించేయి. లేడీ డాక్టరుచేత తనికీ చేయిస్తే ఆమె అదే నిర్ధారణ చేసింది....

“అక్క మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది. నాన్నగారికి ఆ సాయంత్రం రక్తపోటు హెచ్చిపోయింది. పక్షవాతం వచ్చి కుడి పార్శ్వం అంతా పడిపోయింది...

“ఈ వార్త తెలిసిన వెంటనే మా అన్నలొచ్చేరు. అంటే రంగూన్ ట్రేడింగ్ కో వాళ్ళు. నాన్నగారికి వైద్యం ఏర్పాటుచేసేరు. అక్క మతిపోయిన దాన్లా తిరుగుతోంది. అంచేత ఒక వంటమనిషిని యేర్పరచేరు. ప్రతి నెల డబ్బుకూడా యిస్తుండే వారు

*(ముగింపు వచ్చే సంచికలో)*